అనుభవించడం మనిషికి వాంఛనీయం. కానీ బాధ్యతలను గుర్తుచేసినంతగా, హక్కులను ఆమోదించని దుస్థితి నేటి సమాజంలో ఉంది. బాలలు, మహిళలు, వృద్ధులకు రకరకాల హక్కుల్ని మనం సాధించుకన్నాం. ఆ **మానవ హక్కుల** అమలుకోసం మా.వి.వే. పోరాడుతుంది.

మన సమాజంలో మొదట్నుంచి మతమూ, రాజకీయమూ పెనవేసుకుని ఉండడం వల్ల ప్రజాస్వామ్యం సుదూరంగా ఉండిపోయింది. మత లక్షణాలైన నిరంకుశత్వం, పెత్తందారీ తనం, వంశపారంపర్యత, వ్యక్తి ఆరాధన మొదలైనవన్నీ రాజకీయంలో ప్రవేశించి నేరదృష్టి, స్వార్థపరత్వం, నయవంచన వంటి అప్రజాస్వామిక లక్షణాలు పెరగడానికి కారణమయ్యాయి. ఫలితంగా నేడు ప్రజాస్వామ్య ముసుగులో అప్రజాస్వామికత రాజ్యమేలుతున్నది. **లౌకిక, ప్రజాస్వామ్య రాజనీతి** సూత్రాలు అమల్లోకి రావాలని మా.వి.వే. కోరుతున్నది.

మన చదువులో భాగమైన 'సైన్సు' కేవలం మార్కులకే పరిమితమైంది. దాన్ని జీవితానికి అన్వయించుకోవాలనే ఆలోచన లేకుంది. కనుక, సైన్సు ప్రబోధించే శాస్త్రీయ దృక్పధం, శాస్త్రీయ పద్ధతి వంటివి మనకి అందని పండ్లులా మారాయి. అందుకే, అశాస్త్రీయమైన జ్యోతిష్యం, వాస్తు, మంత్రాలు, బాణామతి వంటి మూఢనమ్మకాలను ఇంకా మనం అంటిపెట్టుకుని ఉన్నాం. వంచకులైన స్వాముల్ని, బాబాల్ని, మాతల్ని, అవతారమూర్తుల్ని గుడ్డిగా ఆశ్రయిస్తున్నాం. ఎంత చదువుకున్నా కొంతైనా శాస్త్రీయత పట్టుబడకపోవటం వల్లనే మన తెలివిని, శక్తిని, ధనాన్ని, ఆత్మాభిమానాన్ని తాతల కాలం నాటి దురాచారాలకు, వంచనాపరులకు ధారపోస్తున్నాం. **శాస్త్రీయదృక్పధం** ఎంతగా విస్తరించితే మన జీవితాల్లోంచి అజ్ఞానం అంత త్వరగా అంతరిస్తుంది. విజ్ఞానం వెల్లివిరుస్తుంది. కనుక **శాస్త్రీయదృక్పధాన్ని** మా.వి.వే. తన ప్రచారంలో భాగంగా చేసుకుంది.

పరిణామ క్రమంలో మనిషికి సంక్రమించిన అవాంఛనీయ విలువల్లో స్వార్థమూ ఒకటి. కుటుంభ జీవనం ఏర్పడి, వ్యక్తిగత సంపదపట్ల మోజుపెరిగి దోపిడి స్వభావము జతపడింది. సహకారం, సామరస్యం వంటి సామాజిక విలువలను మర్చిపోయి ప్రవర్తిస్తున్నాడు. తద్వారా ఆర్థిక రంగంలో అసమానతలు క్రమంగా విస్తరించాయి. ఈ అసమానతల వ్యవస్థ నీరసించి, నిర్వీర్యం కావాలంటే సహకార ఆర్థిక విధానం కావాలి. ఈ పద్ధతి ద్వారా ఆర్థిక అసమానతలు తొలగడమే కాకుండా పరస్పర స్నేహం, సహకారం, శాంతి సమానత వంటి సామాజిక జీవన విలువలు కూడా వృద్ధిచెంది ఇప్పటికంటే మెరుగైన జీవన విధానం ఏర్పడుతుందని మా.వి.వే. ఉద్దేశపడుతుంది.

మనిషి ఎంత గొప్పగా ఎదిగినా ప్రకృతిలో ఒదిగి ఉండాల్సిందే. అన్ని జీవజాతుల్లో ఒకటై తన ఉనికిని కాపాడుకోవలసిందే. ప్రకృతిని వికృత పరచి కాలుష్యాన్ని పెంచుకుని కొత్త రోగాల్ని కొని తెచ్చుకుని తన జీవన భద్రతను తానే నరుక్కుంటూ పోతే మానవ జీవితం విషాదాంతమే అవుతుంది. వ్యాపారుల ధనవ్యామోహానికి, స్వార్థపరత్వానికి ప్రకృతిని బలిపెట్టటాన్ని మా.వి.వే. వ్యతిరేకిస్తున్నది. **సమతుల్యతను కోల్పోని ప్రకృతి వినియోగాన్ని** మాత్రమే మా.వి.వే. బలపరుస్తుంది.

పై ఆశయాలతో, ఆలోచనలతో ఉభయ రాష్ట్రాలలో పనిచేస్తున్న మా.వి.వే. జాతీయ స్థాయిలో 'భారతీయ హేతువాద సంఘాల సమాఖ్య' (ఎఫ్.ఐ.ఆర్.ఎ)లోనూ, అంతర్జాతీయంగా 'ఐ.హెచ్.ఇ.యు.' (అంతర్జాతీయ మానవవాద నైతికవాద సంఘం - లండన్)లోనూ సభ్య సంఘంగా వుంది. **భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 51ఎ (హెచ్)**కు కట్టుబడి 'సంఘ సంస్కరణను మానవవాదాన్ని, శాస్త్రీయ స్పృహను పెంచడం' తన విధిగా ఎంచుకుంది. దానికి తగిన కార్యాచరణను రూపొందించుకుంది.

**మిత్రులారా !**

మన భావాలు మారకుండా సమాజం మారదు. భావదాస్యం నుంచి బయటపడకుంటే జీవితం మెరుగవదు. కాలం చెల్లిన ఆదిమ భావాలతో ఆధునిక సమాజం, నూతన జీవితం ఏర్పడవు. భావవిప్లవంతోనే అవి సాధ్యం. మనం మంచి పౌరులుగా ఎదిగి, మంచి జీవితాన్ని, మంచి సమాజాన్ని ఏర్పరుచుకోవడానికి మా.వి.వే. తోడ్పడుతుంది. మా.వి.వే. ఆలోచనలు మీకు నచ్చితే మీరు స్వచ్ఛందంగా ఈ సంస్థ చేసే కృషిలో పాలుపంచుకొనవచ్చు. మీకిదే మా ఆహ్వానం.

# మానవ వికాస వేదిక

mvvedika@gmail.com, Ph : No. 9490419004, 9052567111, 9393944669

చదవండి : **'స్వేచ్ఛాలోచన'** *(మానవ వికాస మాసపత్రిక)*

చిరునామా : 5-229, జె.పి.ఎన్.నగర్, మియాపూర్, హైదరాబాద్ - 500049. email : swetchalochana@gmail.com